క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



శాయంపేట : మండలంలోని పత్తిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పల్లె బోయిన నితిన్ అండర్–14 విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి తెలిపారు. ఇటీవల హనుమకొండ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లాలోని 14 మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా నితిన్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని హెచ్ఎం మాధవి, పీఈటీ దేవేందర్, ఎస్ఎంసీ చైర్మన్ గడ్డమీది శ్రీలత, సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలి

పరకాల: విద్యా సంస్థలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. భూపాలపల్లి వెళ్లే రోడ్డులో గల శివ వైన్స్ దేవాలయం సమీపంలో ఉందని ఇటీవల మహిళలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సమీపంలోని న్యూ కేంబ్రిడ్జి స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎక్సైజ్ శాఖ సీఐ కె.జగన్నాథరావుకు వినతిపత్రం అందించారు. కొందరు మందు బాబులు పాఠశాలకు వెళ్లే దారిలో మద్యం సీసాలు పడేయంతో విద్యార్థులకు, మహిళలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. తక్షణమే మద్యం దుకాణం ఎత్తివేయాలని వారు కోరారు.

బెల్టు షాపులపై దాడులు

దామెర: మండలంలోని ఊరుగొండలోని బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలో ముగ్గురు ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదుచేసినట్లు తెలిసింది. కాగా కేసు వివరాల కోసం పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావును ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

టీపీయూఎస్ మండల కమిటీ ఎన్నిక



శేషగిరి, అధ్యక్షుడు

ఐనవోలు : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) మండల కమిటీని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణరావు, దాత మహర్షిలు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా ముదుంబ శేషగిరి(యూపీఎస్, గర్మిళ్లపల్లి), ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రాజేందర్‌రెడ్డి (ఎంపీపీఎస్, లింగమారిగూడెం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కోశాధికారిగా రాంప్రసాద్, మహిళా ప్రతినిధిగా స్వర్ణలత, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, రవికుమార్, ఉపాధ్యక్షులుగా శేఖర్, బంగారి బాబు, కార్యదర్శులుగా రామనాథం, వెంకట్రామ్‌రెడ్డిను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చాలి

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల గ్యారంటీ ద్వారా పేదవారి సొంతింటి కలను నిజం చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. హనుమకొండ సుబేదారిలో లేఖను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భావించిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కట్టించి అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నాయకులు రమేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. పోస్టల్ కాలనీ, సహకారనగర్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, విష్ణుప్రియ గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకులాల్లో సదుపాయాలు కల్పించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల్లాల్లో విద్యార్థుల సంక్షేమం కోసం సదుపాయాలు కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, జనరల్ సెక్రటరీ విద్యాసాగర్, కోశాధికారి ఝాన్సీరాణి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్కను గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు.

‘గ్యారంటీ’ గా అమలు చేస్తాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇందిర
- పలు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



కమలాపూర్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వేలేరు : ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని షోడాషపల్లి గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం పేదలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, పీచర ఎంపీటీసీ జల్తారి సంపత్, ఉపసర్పంచ్‌లు సద్దాం హుస్సేన్, రమేష్, లక్ష్మణ్‌నాయక్, రాజమల్లయ్య, సంపత్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం 6 గ్యారెంటీ పథకాలు అందించేందుకు చేపడుతున్న ప్రజాపాలన గ్రామ సభల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ఈనెల 6వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ కోరారు. మండలంలోని సాధోనిపల్లి, రాజుపల్లి, పత్తిపాక గ్రామాల్లో గురువారం ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క దరఖాస్తు ఫారంలో ఐదు పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామస్తుల నుంచి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాషిణి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ గంగాజమున, టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వేలేరు : మాట్లాడుతున్న సింగపురం ఇందిర



శాయంపేట : అవగాహన కల్పిస్తున్న హరిప్రసాద్

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని గూడూరు, శనిగరం, గోపాల్‌పూర్ గ్రామాల్లో గురువారం ప్రజా పాలన గ్రామసభలు కొనసాగాయి. అధికారులు ఆయా గ్రామాల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి, సర్పంచులు అంకతి సాంబయ్య, పింగిలి రవళి, గోపాల్, ఎంపీడీఓ బాబు, తహసీల్దార్ మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, పల్లె దవాఖాన వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరళ

హన్మకొండ: మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించడంతో బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఆ పథకాన్ని అడ్డుకోవడానికి యత్నిస్తున్నారని, ఈక్రమంలో మహిళలంతా ఏకమై వారికి తగిన బుద్ధి చెప్పాలని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ పిలుపునిచ్చారు. హనుమకొండ గోకుల్ నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసి ఆస్తులు అమ్ముకోవడానికి ప్రయత్నించిందని, కార్మికుల హక్కులను కాలరాసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకులు పూల, పోశాల జ్యోతి, నక్క రజిత, పోశాల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మామునూరు: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మామునూరు ఎస్సై కృష్ణవేణి సూచించారు. ఏసీపీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ మండలం గాడిపెల్లి గ్రామంలో మామునూరు పోలీసులు, కళాజాత బృందం ఆధ్వర్యంలో ఆటపాటల ద్వారా పలు చట్టాలపై స్థానికులకు గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యానికి బానిసై యువత చిన్నతనంలో జీవితాలను పాడుచేసుకోవద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీ లైబ్రరీ సందర్శన



లైబ్రరీ వద్ద పింగిళి విద్యార్థినులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: క్షేత్ర సందర్శనలో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు కాకతీయ యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. లైబ్రరీలోని పలు సెక్షన్లలో రెఫరెన్స్ పుస్తకాలు, జర్నల్స్, రీసెర్చ్ జర్నల్స్, వివిధ కోర్సులకు సంబంధించిన పుస్తకాల గురించి లైబ్రరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీతో ఉన్న ఏఓయూలో భాగంగా ప్రభుత్వ పింగిళి కళాశాల విద్యార్థినులు లైబ్రరీని వినియోగించుకోవచ్చని కేయూ లైబ్రరీ అసిస్టెంట్లు జవహర్ జాన్సన్, ప్రభాకర్ తెలిపారు. లైబ్రరీని సందర్శించిన వారిలో ప్రభుత్వ పింగిళి కళాశాల అధ్యాపకులు ఫాతిమా, కల్పన, కవిత, జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా అనఘాష్టమి వ్రతం



హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అవధూత దత్తపీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో హోమం, విశేష పూజలు, వెయ్యి మంది భక్తులతో సామూహిక అనఘాష్టమి వ్రతం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్‌రావు, డాక్టర్ కంటం లక్ష్మీనారాయణ, డాక్టర్ వద్దిరాజు శరవాణి, చకిలం ఏకంబరం, విజేందర్ రెడ్డి, శ్రీనివాస్, కుమారస్వామి, ఓంప్రకాష్, వడిచర్ల శ్రీనివాస్, ఆలయ అర్చకుడు రాపాక గోపికృష్ణ, మేనేజర్ వెలిది రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న తాళ్ల మల్లేశం



కాజీపేటలోని శ్రీచైతన్య విద్యార్థులు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు అయాన్ నాయక్, సాయిచరణ్‌ను తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేరళ రాష్ట్రంలో జరిగిన 8వ జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున ఇరువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభాపాటవాలు ప్రదర్శించి రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారని వివరించారు. ఈమేరకు కోచ్ రాకేష్‌రెడ్డితో పాటు విద్యార్థులను గురువారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, కోఆర్డినేటర్ అఫ్జల్ ఉన్నీసా, మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, యామిని తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌టోసో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాజీపేట: జాతీయ స్థాయి ఇన్‌టోసో పోటీల్లో కాజీపేట పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు బండారి కిరణ్ కుమార్ తెలిపారు. లెవల్ –2 పోటీలకు 215 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా వారిని గురువారం అభినందించారు. పాఠశాల డీన్ రమేష్, నీలిమా, నీలోఫర్ ఒలంపియాడ్ ఇన్‌చార్జ్ సంతోష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్పత్తులు, సేవల ఆవిష్కరణే స్టార్టప్ ఇండియా లక్ష్యం



వరంగల్ చౌరస్తా: ఉత్పత్తులు, సేవల అభివృద్ధి ఆవిష్కరణలు, ఉపాధి రేటు పెంచడమే స్టార్టప్ ఇండియా లక్ష్యమని ఏఐస్టార్ట్ ఆఫ్ సంవాద్ స్పీకర్ త్రినాథ్ రెడ్డి తెలిపారు. హంటర్‌రోడ్డులోని ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ కార్యాలయంలో చైర్మన్ రాయబారపు హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సీపీఈ సెమినార్‌లో తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టార్టప్ ఇండియా అనేది భారత ప్రభుత్వం ఫ్లాగ్‌షిప్ చొరవ అని గుర్తుచేశారు. 18లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల భారతీయ పౌరులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ సత్యనారాయణ, శ్రావణ్ కుమార్, దేవసాయం, మాణిక్య ప్రసాద్, తోట కరుణాకర్, రాయన్న పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మకత పెంపు



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వరంగల్ చౌరస్తా: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు, అద్భుత ఆవిష్కరణలకు సైన్స్‌ఫెయిర్ వేదికగా నిలుస్తుందని అధ్యాపకులు అన్నారు. వరంగల్ యాకుబ్‌పురలోని గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో రెండో రోజు గురువారం ఇగ్నైట్ ఫెస్ట్ –2023–24 సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు శ్రీనివాస్ రెడ్డి, భగీరథ్, వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్.వెంకన్న హాజరై మాట్లాడారు. తాము చేసే ప్రతీ పనివెనుక ఎంతో సైన్స్ దాగి ఉందని వివరించారు. అనంతరం, విద్యార్థులు మాక్ పార్లమెంట్ సభ నిర్వహించారు. కార్యక్రమంలో 12 గిరిజన సంక్షేమ పాఠశాలలు, సంక్షేమ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయగా, రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ ఆదర్శప్రాయుడు

విద్యారణ్యపురి: డాక్టర్ లూయి బ్రెయిలీ ఆదర్శప్రాయుడని దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ కొనియాడారు. హనుమకొండ జిల్లాలోని చింతగట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతిని వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల ఐఈడీ కోఆర్డినేటర్ వీరస్వామి, సంఘ బాధ్యులు వాసుదేవరెడ్డి, సుధాకర్, ఉపాధ్యాయులు భాస్కర్, శరత్‌బాబు, శేషగిరి, శిరీష, అన్నపూర్ణ, అనసూయ, అర్పిత, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మసకేసిన మంచు దుప్పటి



శాయంపేట : మండల కేంద్రంలో ఉదయం 9 గంటలు వరకూ సూర్యుడు ఉదయించలేదు. రోడ్డు కనపించకుండా మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులకు రోడ్డు సరిగా కనిపించకపోవంతో ఇబ్బంది పడ్డారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



రేవూరికి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

పరకాల: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాగారం సర్పంచ్ కట్కూరి విజయ దంపతుల కుమారుడు యశ్వంత్ సాయిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయగా ఆయన హాజరై ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పరకాల నుంచి గొప్ప క్రీడాకారులు తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ, నాయకులు మల్లారెడ్డి, శంకర్, హరిప్రసాద్, రమేష్, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

వర్షాకాలం వరద వెళ్లేందుకు పట్టణంలోని శ్రీనివాస కాలనీలో రహదారిపై ఎత్తుగా నిర్మించిన వంతెనను తగ్గించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారితో పాటు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి వినతిపత్రం అందించారు. దామెర చెరువు కట్ట నిర్మాణం కోసం గత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సుమారు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. బిల్లులు రాలేదన్న సాకుతో సంబంధిత కాంట్రాక్టర్ ఆయా పనులు అసంపూర్తిగా నిలిపివేశారని ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణమే వంతెన ఎత్తు తగ్గించడవంతో పాటు శ్రీనివాసకాలనీ వాసులకు అత్యవసరంగా మారిన కాల్వ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘గృహలక్ష్మి’ బిల్లులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎంపికైన గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంలో రూ.3లక్షల ఆర్థిక సాయం అందుతుందని భావించిన లబ్ధిదారులు పాత ఇళ్లలు కూల్చివేసి నూతనంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రతి ఇంటిని అధికారులు సందర్శించి నేరుగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలంటే ప్రస్తుతం పురోగతిలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇళ్లు లేని నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే మంచి భవిష్యత్



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న రాధిక

ధర్మసాగర్ : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే మంచి మార్కులు సాధించవచ్చని, భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడొచ్చని హార్ట్‌ఫుల్ ఫౌండేషన్ ప్రతినిధి రాధిక అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక పరీక్షల సంసిద్ధత మెళకువలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడి, బారం లేకుండా స్వేచ్ఛాయుత మనస్సును కలిగి ఉండాలని అన్నారు. ఏకాగ్రతతో అభ్యసించినప్పుడే చదివినవి గుర్తుకు ఉంటాయని అన్నారు. శరీరానికి, వ్యాయామం లాగా మనస్సుకు, హృదయానికి ధ్యానం, అధ్యయనం ముఖ్యమని, తద్వారా శాంతియుత జ్ఞాన సమాజం ఏర్పడుతుందని అన్నారు. కళాశాల విద్యార్థుల అవసరాలను పౌర సమాజం సాయంతో నెరవేరుస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కృషి గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా 30 వేల విలువ గల పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు చంద్రమౌళి, రాజు, అధ్యాపక బృందం జ్యోతి, కనకయ్య, కరుణాకర్, ప్రభాకర్, ఆజం, గణేష్, గోపాలకృష్ణ, సదానందం, బాబూరావు, రాములు, మంజుల, వెంకట్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందజేస్తున్న సాంబయ్య

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు శాయంపేట గ్రామానికి చెందిన ఎన్నారై బాసాని వెంకటేశ్వర్లు క్రీడా సమగ్రి కొనుగోలుకు సాయం అందించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా టేబుల్ టెన్నిస్, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్, టెన్నీకై ట్, రగ్బీ, పబ్లిక్ అడ్రస్ సిస్టంతో పాటు 4 చైర్లను అందించగా తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతకు అందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కరిత, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు లీలావతి, యోగిత, శంకర్‌భాయ్, నాగలత, కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలి



ఖర్చుల నిమిత్తం డబ్బులు అందజేస్తున్న భిక్షపతి

శాయంపేట : ప్రతిఒక్కరూ పొదుపు చేయడం అలవర్చుకోవాలని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో అయ్యప్ప పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో సభ్యునికి ఖర్చులకు నిమిత్తం రూ. 5వేల చొప్పున 50మంది సభ్యులకు పరపతి సంఘం అధ్యక్షుడు భిక్షపతి అందించారు. పొదుపు చేయడం అలవర్చుకుంటేనే ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. అయ్యప్ప స్వామి సాకర్యార్థం ఈ పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంఘం ఉపాధ్యక్షుడు దిడ్డి రమేష్, కార్యదర్శి బొల్లపల్లి సదానందం, కోశాధికారి మార్త సుమన్, సంఘ సభ్యులు ప్రవీణ్, రాము, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

ఎల్కతుర్తి: మండల కేంద్రానికి నేడు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రానున్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.